క్లుప్తంగా

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ అందిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

కాకినాడ రూరల్: పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు పలు అంశాలను వివరించారు. పంచాయతీల పురోగతికి సంవత్సర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల వితరణ



విద్యార్థులకు పరుపులు అందిస్తున్న తుమ్మలపల్లి నారాయణరావు

బోట్‌క్లబ్: స్థానిక నరసన్ననగర్‌లో సేవాభారతి ట్రస్ట్ సచికేత పిల్లల హాస్టల్లో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఎలైట్ తరఫున తుమ్మలపల్లి నారాయణరావు సౌజన్యంతో 20 పరుపులను శనివారం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరావు చేతుల మీదుగా వాటిని అందజేశారు. బిక్కిన విశ్వేశ్వరావు మాట్లాడుతూ రానున్న చలికాలంలో విద్యార్థులు పడుకునేందుకు ఇబ్బంది పడకుండా దాతలు పరుపులు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పవన్, సెక్రటరీ స్రవంతి, క్లబ్ మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, గూడూరు పద్మ పాల్గొన్నారు.

గ్రామదేవత నేరేళ్లమ్మకు సారె సమర్పణ



కొరిపల్లి గ్రామదేవత నేరేళ్లమ్మకు సారె సమర్పించి పూజలు చేస్తున్న మహిళలు

కరప: కొరిపల్లి గ్రామదేవత నేరేళ్లమ్మకు శనివారం గ్రామ ఆడపడచులు చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ఆడపడచులు, మహిళలు పసుపు, కుంకుమ, గాజులు వివిధ రకాల స్వీట్లు ఉంచిన బిందెలు, చలివిడి, అరటిపళ్ల గెలలతో పట్టుచీర కావిడితో గరగ నృత్యాలు, డప్పులవాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన మహిళలు గ్రామంలోని దుర్గాదేవికి పూజలు చేసి, అక్కడి నుంచి ఊరేగింపుగా గ్రామదేవత నేరేళ్లమ్మ గుడివద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారె సమర్పించి, పూజలు చేశారు. ఆషాఢమాసంలో గ్రామంలోని ఆడపడచులు, మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించి, మొక్కులు తీర్చుకోవడం ఆచారంగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

రైతు అభ్యున్నతికి డీసీసీబీ సహకారం



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

బోట్‌క్లబ్: (కాకినాడసిటీ): రైతుల అభ్యున్నతి కోసం డీసీసీబీ నిరంతరం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. కాకినాడలోని డీసీసీబీ కార్యాలయంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార బ్యాంకు రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. బ్యాంకుల్లో పేరుకొని పోయిన మొండి బకాయిలును వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీజీఎం సోమునాయుడు, ఆప్కాబ్ ఏజీఎం బాపూజీ, జిల్లా సహకార అధికారి కుమార్ పాల్గొన్నారు.

విష్ణుమూర్తికి నేడు ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసియున్న విష్ణుమూర్తికి ఆషాఢ మాసం, ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం శనివారం తెలిపారు. స్వామి వారికి పంచా మృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో?

- ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- రూ.18.50 కోట్లు మంజూరు చేసిన మాజీ మంత్రి కన్నబాబు



గొడ్డటిపాలెంలో అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

కరప: రెండు మండలాలను అనుసంధానం చేసే రహదారి విస్తరణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క గ్రామం పరిధిలోనూ డ్రెయిన్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆ గోతుల్లోపడి గాయాలపాలవుతున్నా పట్టించుకోని అధికారుల తీరుకు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల డ్రెయిన్‌లో పడిన ఓ యువకుడికి ఇనుప ఊసలు గుచ్చుకుని ప్రాణాలు కోల్పోయాడు. అధికారులు, పాలకులు పట్టించుకోవడంపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

రెండు మండలాలకు అనుసంధానంగా రోడ్డు

కరప, పెదపూడి మండలాలను అరట్లకట్ట రోడ్డు అనుసంధానం చేస్తుంది. మండల పరిధిలోని కరప నుంచి అరట్లకట్ట, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల మీదుగా పెదపూడి మండలం కరకుదురు వరకూ ఈ రహదారి కొనసాగుతుంది. ఈ గ్రామాల ప్రజలు కరకుదురు, ఇంద్రపాలెం మీదుగా కాకినాడ పట్టణానికి వెళ్లేందుకు దగ్గరదారిగా ఉంటుంది. పెదపూడి, జి.మామిడాడ గ్రామాలకు అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. పెదపూడి మండలవాసులు కరప మండలానికి అరట్లకట్ట వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ అరట్లకట్ట రోడ్డు సింగిల్ వేగా ఉండేది. రోడ్డుపై గోతులు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు నరకయాతన పడేవారు. ఈ రహదారిలో ఉండే అరట్లకట్ట వంతెన శిథిలావస్థకు చేరడంతో ఒకవైపు కుంగిపోయింది. ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు 2021లో వ్యవసాయశాఖ మంత్రిగా ఉండగా అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి రహదారి ఆధునీకరణకు రూ.18.50 కోట్లు మంజూరు చేశారు.



జెడ్.భావారంలో అసంపూర్తిగా డ్రెయిన్ నిర్మాణం



కరపలోని ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి

పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్

ఈ నిధులతో కరప నుంచి దోమాడ మీదుగా ఇంద్రపాలెం, కరప, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాలను అనుసంధానం చేసే రహదారిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2022 ఏప్రిల్ 25న నాటి కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతతో కలసి రోడ్డు పనులకు ఆయన భూమి పూజచేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్డు, రోడ్డుకిరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి మధ్యలో కల్వర్టులు, అరట్లకట్ట వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. అరట్లకట్ట రోడ్డు వెడల్పు చేసి, బీటీ రోడ్డు వేయాలి. తర్వాత కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి గోతులు తవ్వి కొంతకాలం వదిలేశారు. తర్వాత పనులు చేపట్టారు. అరట్లకట్ట వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి, డ్రెయిన్లు, రోడ్డు ఆధునీకరణ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

2024లో ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రోడ్డు విస్తరణ పనులు చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. గత నెలలో కొరిపల్లికి చెందిన యువకుడు పరిసిపోగుల బాబులు అదుపుతప్పి డ్రెయిన్‌లో పడిపోవడంతో డ్రెయిన్ గోడకు ఉండే ఇనుప ఊస తలలోకి గుచ్చుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కరప, కొరిపల్లి, గొడ్డటిపాలెం, జెడ్.భావారం గ్రామాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డు వెడల్పు చేసేందుకు తవ్విన గోతులు ప్రస్తుతం పూడుకుపోతున్నాయి. దీంతో గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో ప్రమాదాలు



రోడ్డు వెడల్పు చేసేందుకు గోతుల తవ్వేసి, డ్రెయిన్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కొరిపల్లిలో ఒక యువకుడు డ్రెయిన్‌లో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులు స్పందించి విస్తరణ పనులు పూర్తి చేయించాలి.

–పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరప మండలం

అధికారులు స్పందించాలి



రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయడం వల్ల రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరప, కొరిపల్లి, జెడ్.భావారం గ్రామాల్లో డ్రెయిన్లు అసంపూర్తిగా వదిలేయడంతో చిన్నపిల్లలు అందులోపడి గాయాలపాలవుతున్నారు. ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులను జెడ్పీ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళతాను.

– యాళ్ల సుబ్బారావు, జెడ్పీటీసీ, కరప మండలం

వివాదాస్పద స్థలంలో అధికారుల సర్వే



సర్పవరంలో బర్మా కాందిశీకుల కోసం నిర్మించిన పట్టు గూళ్ల పరిశ్రమ షెడ్డు వద్ద సెరీకల్చర్ డిపార్టుమెంట్ అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో పూర్వం బర్మా కాందిశీకుల సొసైటీకి కేటాయించిన భూములు చేతులు మారడంతో అందులో ఉన్న భవనాలను ఇటీవల కూల్చివేశారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు రంగప్రవేశం చేశారు. బర్మా కాందిశీకుల సొసైటీ నుంచి ఎస్సీ కార్పొరేషన్‌కు ఎకరం స్థలం కాందిశీకుల స్వయం ఉపాధి కోసం సెరీకల్చర్ డిపార్టుమెంట్‌కు అప్పట్లో అప్పగించడంతో వాటిలో భవనాలు నిర్మించి పట్టు గూళ్ల తయారీ పరిశ్రమను నిర్వహించారు. కాలక్రమేణా పట్టు గూళ్ల తయారీ మూతపడడంతో భవనాలు నిరుపయోగంగా మారాయి. విలువైన స్థలం రికార్డులు చేతులు మారడంతో ప్రైవేట్ వ్యక్తులు భవనాల తొలగింపును ఇటీవల చేపట్టగా ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందడంతో బ్రేక్ పడింది. శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ వీవీఎస్ఎన్ మూర్తి, సిబ్బంది, సెరీకల్చర్ జిల్లా అధికారి పాల్‌రాజు, సిబ్బంది సమక్షంలో మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు పి. శ్రీనివాస్, తదితరులు భవనాలు కూల్చిన స్థలంలో సర్వే చేశారు. సర్వే వివరాలను జిల్లా అధికారులు, ఎస్సీ కార్పొరేషన్, సెరికల్చర్ డిపార్టుమెంట్లకు అందజేస్తామని సర్వేయర్ రామకృష్ణ తెలియజేశారు. బర్మా కాందిశీకుల కుటుంబానికి చెందిన సాయి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

విష్ణ్వాలయంలో నేడు తొలి ఏకాదశి పూజలు



కరపలో వేణుగోపాలస్వామి

కరప: స్థానిక విష్ణ్వాలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ తెలిపారు. ఆలయంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఆషాఢ మాసంలో శుద్ధ ఏకాదశి రోజునే తొలి ఏకాదశి, శయనా ఏకాదశి అంటారని అర్చకుడు అనంతాచార్యులు తెలిపారు. ఈ ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైనదని ఆయన తెలిపారు. ఈ రోజు నుంచి కార్తీకమాస శుద్ధ ఏకాదశి రోజు వరకు చాతుర్మాస వ్రతం భక్తులు నిర్వహిస్తారని తెలిపారు. పాల కడలిలో శయనించిన శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమిస్తాడన్నారు. ఈరోజు నుంచి చాతుర్మాస దీక్ష ప్రారంభమై కార్తీకమాసం శుద్ధ ఏకాదశి రోజున విష్ణుమూర్తి మేల్కొనడంతో దీక్ష విరమిస్తాడని ఆయన చెప్పారు. ఆషాఢమాసం శుద్ధ ఏకాదశి రోజున పూజలు చేస్తే తలపెట్టిన కార్యాలు సిద్ధిస్తాయని అనంతాచార్యులు తెలిపారు. ఆలయంలోని స్వామివార్లకు తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసినట్టు దేవాదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ తెలిపారు. యండమూరులోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేస్తామని ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి



కరపలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కరప: డెంగీ వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్ అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవం–జూలై 2025 పురస్కరించుకుని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులు, వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తీవ్రమైన చలి జ్వరం, కీళ్లనొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్లు వంటి లక్షణాలు కనపడితే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్యసేవలు పొందాలన్నారు. ప్రాణాంతక వ్యాధులు వ్యాపింపజేసే దోమలు నిల్వ ఉన్న నీటిలో ఎక్కువగా పెరుగుతాయన్నారు. గృహాల్లో, గృహ ఆవరణలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించి డెంగీపై అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావు, పీహెచ్‌సీ సిబ్బంది యాతం నాగబాబు, కె.గోపాలరావు, బీవీవీ సత్యనారాయణమ్మ, ఎస్.సీత పాల్గొన్నారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం



గోపీనాథ్‌ను అభినందిస్తున్న క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు తదితరులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా వంశీ చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ గోపీనాథ్, కార్యదర్శిగా ట్రస్ట్ హాస్పిటల్ వైద్యులు సానా ప్రవీణ్, కోశాధికారిగా ఆదిత్య హాస్పిటల్ అధినేత వి.ఉదయ చక్రవర్తులతో మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ క్లబ్ చేపట్టిన శాశ్వత ప్రాజెక్టులను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాల నిర్వహణకు అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు. రోటరీ అంతర్జాతీయ అధ్యక్షుడి సందేశమైన యూనిటీ ఫర్ గుడ్ ఆచరణలోకి తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

గ్రామ సభలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం



తిమ్మాపురం గ్రామ సభలో ఇరువర్గాలతో చర్చిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: గ్రామ అభివృద్ధికి సంబంధించి చేపట్టవలసిన పనులకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరణ, పంచాయతీ తీర్మానాల కోసం కాకినాడ రూరల్‌లో శనివారం తిమ్మాపురం, నేమాం, పండూరులో గ్రామ సభలు నిర్వహించారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాంలో సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు, పండూరులో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రామన్న చౌదరి, మోహన్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పంచాయతీ సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు తీర్మానాలు చేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో చెరువు వేలం పాట సొమ్ము పాటదారుడి నుంచి వసూలు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్య తీసుకున్నారు. గ్రామ సభలో వైస్ ఎంపీపీ బందిలి వీరేష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు తాతాజీ, రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు సాయం అందజేత



విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉత్తమ్ ఫరేక్ దంపతులు, చిత్రంలో డాక్టర్ బొల్లం సతీష్

కాకినాడ క్రైం: కోవిడ్ వేళలో తండ్రిని కోల్పోయి చదువుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ విద్యార్థినికి సహృదయం కలిగిన దంపతులు సాయం అందించారు. కాకినాడకు చెందిన ఉత్తమ్ ఫరేక్ దంపతులు నిహారిక కృష్ణ అనే విద్యార్థిని చదువుకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ దంపతులు మూడేళ్లుగా ఈ విద్యార్థిని చదువుకు రూ.55వేలు ఆర్థిక సహాయం అందించారు. శనివారం రూ.20వేలు మొత్తాన్ని శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ ఆధ్వర్యంలో కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లి సుజాత, చామంతి చక్రి, శ్రీదేవి దంపతులు, రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

300 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ



కాకినాడ వైద్యనగర్ 4వ వీధిలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ పెద్దిరాజు

కాకినాడ రూరల్: నగరంలోని 2వ డివిజన్ పరిధిలో వైద్యనగర్ 4వ వీధిలో భారీ చోరీ జరిగింది. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాగిరాజు రోజా ఇంట్లోకి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి సుమారు 300 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ బొక్కా పెద్దిరాజు, సిబ్బంది, క్లూస్ టీమ్ చోరీ ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు. శుక్రవారం అర్ధరాత్రి లేదా శనివారం తెల్లవారు జామున చోరీ జరిగి ఉంటుందని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో చోరీ సొత్తు విలువ రూ.20 లక్షలు పైబడి ఉంటుందని బాధితులు అంటున్నారు.

సరిహద్దు వివాదంపై కేసు నమోదు

కరప: ఇంటి సరిహద్దులో దారికోసం జరిగిన వివాదంలో తనపై దౌర్జన్యం చేసినట్టు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కరప పోలీసులు శనివారం తెలిపారు. మండలం వేళంగిలో నివాసం ఉంటున్న మెర్ల విజయభారతి ఇంటికి వెనుకభాగంలోని ఖాళీ స్థలంలోకి వెళ్లేందుకు తూర్పుదిశలో ఉండే దారికోసం మెర్ల శ్రీమన్నారాయణ, మెర్ల శ్రీనివాస్ మధ్య గొడవ జరుగుతోంది. ఈనెల 3న ఈదారి కోసం వారి మధ్య జరిగిన వివాదంలో శ్రీమన్నారాయణ, శ్రీనివాస్‌లు విజయభారతితో గొడవపడి, అసభ్యపదజాలంతో దూషించారు. ఆమె వెళ్లి తన తమ్ముడు వీరరఘురాంను పిలుచుకుని రాగా అతనిని కూడా దుర్భాషలాడి కొట్టడానికి వెళ్లి భయాందోళనకు గురిచేశారు. తమను అసభ్యపదజాలంతో తిట్టడమే కాకుండా కొట్టడానికి వచ్చినట్టు విజయభారతి శనివారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు వేళంగి విద్యార్థి ఎంపిక



రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థి హరీష్

కరప: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న తల్ సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూపు కాంపిటీషన్ (టీఎస్‌సీ ఐజీసీ) రైఫిల్ షూటింగ్ పోటీలకు కరప మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి డి.హరీష్ ఎంపిక య్యాడు. గత నెల 21 నుంచి 30వ తేదీ వరకు ఏలూరులోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన టీఎస్‌సీ ఐజీసీ ల్యాంచింగ్ క్యాంప్‌లో ఫైరింగ్ విభాగంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు తరపున తమ విద్యార్థి హరీష్ పాల్గొన్నట్టు హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు శనివారం తెలిపారు. ఆ పోటీలో అత్యుత్తమ ప్రతిభ చూపడంతో కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. టీఎస్‌సీ ఐజీసీ రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థి హరీష్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నారావు, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్ఎం త్రిమూర్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గూగుల్ క్లౌడ్ సర్టిఫైడ్ డిజిటల్ క్యాంపస్‌గా కైట్‌కు గుర్తింపు



గూగుల్‌తో ఒప్పందం చేసుకుంటున్న కైట్ కళాశాల ప్రతినిధులు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): గూగుల్ క్లౌడ్ 2.0పై సర్టిఫైడ్ డిజిటల్ క్యాంపస్‌గా కైట్ కళాశాల అధికారికంగా గుర్తింపు పొందిందని కళాశాల డైరెక్టర్ ఐశ్వర్య తెలిపారు. శనివారం బెంగుళూరు గూగుల్ సంస్థ కార్యాలయంలో కైట్ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ గుర్తింపుతో , విద్యార్థులకు క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్, ఏఐ, ఎంఎల్ మాడ్యుల్స్, గూగుల్ వర్చువల్ ల్యాబ్ వంటి ఆధునిక టెక్నాలజీపై ప్రాక్టికల్స్‌కు అవకాశం ఉంటుందన్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు పొందే అవకాశంతోపాటు విద్యార్థులు గ్లోబల్ టెక్ రంగంలో పోటీకి సిద్ధంగా మారతారన్నారు. అధ్యాపకులు ఈ టూల్స్ రిసోర్సెస్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు ప్రత్యేక శిక్షణ పొందుతారన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మెరుగైన ఫలితాలు నాణ్యమైన విద్యను అందించగలుగుతారన్నారు. కైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ విశ్వం దూరదృష్టి వల్లే గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం లభించిందని ప్రిన్సిపాల్స్ రేవతి, రామకృష్ణ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1949 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌ను పరిశీలిస్తున్న లోక్ అదాలత్ చైర్మన్ ఆనంది

కాకినాడ లీగల్: జాతీయలోక్ అదాలత్ ద్వారా 1,949 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ జి.ఆనంది తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం 10 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతోపాటు ఇతర కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు.

13న కవల పిల్లల సమ్మేళనం

బాలాజీచెరువు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జూలై 13న ఆదివారం కవల పిల్లల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ అడ్మిన్‌వైస్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ శనివారం తెలిపారు. స్థానిక సినిమారోడ్డులోని సూర్యకళా మందిరంలో కవల పిల్లల పెంపకం, వారి జీవనశైలి, సంప్రదాయ వస్త్రధారణ, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జ్ఞాపిక అందజేస్తామన్నారు. 25 ఏళ్లలోపు గల కవల పిల్లలు పాల్గొనవచ్చని, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ పాల్గొంటారన్నారు. పేర్లు నమోదు కోసం 9866003633 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

నడకుదురు గుడిలో చోరీ

కరప: నడకుదురు గ్రామంలోని ఓ గుడిలో దొంగలు చొరబడి నగదుతో ఉన్న హుండీని అపహరించారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం నడకుదురులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి ఈనెల 3న గుర్తుతెలియని వ్యక్తులు చొరపడి హుండీ తాళం బద్దలుకొట్టి అందులోని రూ.3 వేలు నగదును అపహరించారు. సదరు గుడిని పర్యవేక్షిస్తున్న గొల్లపల్లి చంద్రశేఖర్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.